
రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో చేరిన నీరు

అధ్వానంగా దేవేందర్‌నగర్ రోడ్డు

గాజులరామారం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ చౌరస్తా ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. అడుగు లోతు గుంతల్లో వర్షం, మురుగునీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారి ఆరు నెలలు కావస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు గానీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కుత్బుల్లాపూర్, దేవేందర్‌నగర్ బస్తీప్రజలు వివిధ అవసరాల కోసం నిత్యం ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలి


ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

షాపూర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళలో వరద బీభత్సం సృష్టించడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధితులకు ఆపన్నహస్తం అందించి, ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కుత్బుల్లాపూర్ సీపీఎం మండల కమిటీ సభ్యులు బి.సత్యం, శంకర్‌రావు, స్వాతి, సీఐటీయూ నాయకులు కె.శ్రీను, కరుణాకర్, మల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చందానగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్‌లో ఒమేగా ఆస్పత్రి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో ఎత్తు, బరువు, రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ, 2డి ఎకోతో పాటు మహిళలకు పాప్‌స్మెర్, మామోగ్రఫీ, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆంజనేయ రాజు, ప్రసాద్, సంబిరెడ్డి, కరుణాకర్‌గౌడ్, చంద్రశేఖర్, వెంకట్రావ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హైదర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆసిరెడ్డి భూపాల్‌రెడ్డి, విజిత్‌వర్మ, మణిభూషణ్, శ్రీకాంత్‌యాదవ్, బాలుయాదవ్, శ్రీలత, సంధ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో గద్దర్ వర్ధంతి రేపు

గాజులరామారం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న రవీంద్రభారతిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహిస్తున్నారని, కవులు, కళాకారులు అభిమానులు హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రజా కవి దరువు అంజన్న తెలిపారు. గాజులరామారంలో ఆదివారం గద్దరన్న యాదిలో పేరుతో పోస్టర్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కవులు, కళాకారులు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాకవి, జర్నలిస్టు మోహన్ బైరాగి, డప్పు రామస్వామి, జోగు వెంకట్, సాయి, ఆనంద్, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


శిల్పా లేఔట్‌లో సమస్యలను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం శేరిలింగంపల్లి శిల్పా లేఔట్‌లో స్థానికులతో కలిసి ప్రజా సమస్యలను పరిశీలించారు. వాటిని అధికారుల దృష్టికి తీసువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. అనంతరం కూకట్‌పల్లి డివిజన్ దీనబంధు కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.


కమిటీ సభ్యులతో కార్పొరేటర్, సంఘం నూతన అధ్యక్షుడు రవిసింగ్

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రవిసింగ్

షాపూర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షుడిగా కార్మిక నాయకుడు రవిసింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిసింగ్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం రవిసింగ్‌ను సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షులుగా ఎం.విట్టల్, రాజుసాగర్, ప్రధాన కార్యదర్శులుగా సహదేవ్, అఖిలేష్, కోశాధికారిగా చైతన్యను ఎన్నుకున్నారు.


శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న సంఘాల నాయకులు

బీఆర్‌ఎస్ పాలనలో బాధితులకు న్యాయం చేస్తా

షాపూర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పదేండ్ల బీఆర్‌ఎస్ పార్టీ పాలనలో బాధితులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలు కాలనీలు, సంక్షేమ సంఘాల నాయకులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. బహదూర్‌పల్లి, గుబురుగుట్ట కాలనీలకు చెందిన ప్రజలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. అందరి సమస్యలు పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను తప్పక నెరవేరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

దోమల విజృంభణ

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- కాముని చెరువును కప్పేసిన గుర్రపుడెక్క
- నిద్రావస్థలో అధికారులు


గుర్రపుడెక్కతో నిండిన కాముని చెరువు

అల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని అనేక కాలనీలలో దోమల బెడద తీవ్రంగా ఉంది. డివిజన్‌కు చుట్టుపక్కల ఉన్న సున్నంచెరువు, మైసమ్మచెరువు, కాముని చెరువు ఉన్నాయి. ఈ చెరువుల చుట్టు పక్కల చెత్తాచెదారం, గుర్రపుడెక్క ఉండడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయిందంటే దోమలు డివిజన్ పరిధిలోని పలు కాలనీలపై దాడి చేస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో పలువురు వ్యాధులకు గురవుతున్నారు. చెరువుల్లో పరుచుకున్న గుర్రపుడెక్కతో దోమల అధికంగా పెరుగుతున్నాయని అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఫలితంగా నిత్యం ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముక్కు పిండి వేలకు వేలు ఆస్తి పన్ను కట్టించుకునే బల్దియా.. ప్రజల కనీస అవసరాలు తీర్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల సమస్యను వదిలేసి పరిసరాల పరిశుభ్రత పౌరుల బాధ్యత అంటూ అధికారులు తప్పించుకుంటున్నారని వాపోతున్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రేయింగ్ కూడా చేయక పోవడం దారుణమని వాపోతున్నారు. సున్నంచెరువు పరిసర ప్రాంతాలైన గాయత్రి నగర్, జ్యోతినగర్, పద్మావతినగర్, మైసమ్మ చెరువు పరిసర కాలనీవాసులు రాజీవ్ గాంధీ నగర్ కామునిచెరువు సమీప కాలనీలైన సఫ్దర్‌నగర్, వివేకానందనగర్, తులసినగర్‌లలో సాయంత్రమైతే దోమలు దండయాత్ర చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి దోమల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దొడ్డి కొమురయ్యపై మరిన్ని చిత్రాలు రావాలి


మాట్లాడుతున్న సేనాపతి

రాంనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాడు భూమి, భుక్తి, వెట్టిచాకిరి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్యపై మరిన్ని చిత్రాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దొడ్డి కొమురయ్య సొసైటీ అధ్యక్షుడు ఎం. సేనాపతి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణంలో భాగంగా సినిమా నిర్మాణం కృతజ్ఞత సభ జరిగింది. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, లోక్‌సత్తా నాయకుడు శ్రీనివాస్, ఆరెకటిక సంఘం అధ్యక్షుడు బి. అశోక్‌కుమార్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామని సేనాపతి తెలిపారు.

పద్యం తెలుగువారి సొంతం

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పద్యం తెలుగువారి సొంతం అని సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగాన సభలో రంగస్థల పద్యాల పోటీలు జరిగాయి. పద్యాలు గానం చేసిన బాలబాలికలను అభినందించి నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పార్వతీశం మాట్లాడుతూ.. పద్యం లేకుండా తెలుగు భాష లేదన్నారు. ఈ తరం యువత పద్యవైభవాన్ని పరిరక్షించాలన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి, అక్కిరాజు సుందరరామకృష్ణ, వాసవదత్త రమణ, కొట్టి వెంకటాచార్యులు, రఘుశ్రీ పాల్గొన్నారు.


సాహిత్యోత్సవంలో ప్రదర్శన ఇచ్చిన కళాకారులు

మనూలో జష్న్ ఏ ఆదాబ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఆదివారం జష్న్ ఏ ఆదాబ్ పేరుతో నిర్వహించిన సాహిత్యోత్సవం ఆహూతులను మైమరపింపజేసింది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్, నటుడు అమిత్ సియాల్, ఫైసల్ మాలిక్, మానురిషి చద్దా, జాతీయ అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యకారిణి యామినీరెడ్డితో పాటు అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మనూ వీసీ ప్రొ. ఐనుల్ హసన్, శాస్త్రవేత్త ప్రొఫెసర్ సయ్యద్ ఇ.హస్నైన్, తెలంగాణ జీఎస్టీ ప్రధాన కమిషనర్ సందీప్ ప్రకాష్, ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుమిత, నవనీత్ సోనీ కున్వర్ రంజీత్‌సింగ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనూ వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్, అజ్మ్‌షాకిరీల ఆధ్వర్యంలో 'డెక్కనీ ఉర్దూ మే పార్సీ కే అస్రాత్'పై చర్చా కార్యక్రమం జరిగింది.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ సేవలు చిరస్మరణీయం


మంగళంపల్లి బాలమురళీకృష్ణకు నివాళులర్పిస్తున్న జస్టిస్ రాధారాణి, ఎల్‌వి చెన్నారావు, డాక్టర్ రంగయ్య, డీవీ మోహనకృష్ణ తదితరులు

రాంనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీతానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తి పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. మానసికోల్లా సం, ఆనందంగా ఉండేందుకు సంగీతం దోహదపడుతుందన్నారు. జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాగవర్ధిని కల్చరల్ సొసైటీ సౌజన్యంతో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు.


ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. సంగీతం మనసును తేలిక చేయడమే కాదు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కోలుకునేలా చేస్తుందన్నారు. జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.వి.చెన్నారావు మాట్లాడుతూ.. వాయిద్య కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సహకారం అందించాలని కోరారు. సంగీత వ్యాప్తికి మంగళంపల్లి బాలమురళీకృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేదర్ సందేశాన్ని ఫోన్ ద్వారా సమావేశంలో వినిపించారు. కార్యక్రమంలో అదనపు రవాణా రిటైర్డ్ కమిషనర్ సి.ఎల్.ఎన్.గాంధీ, ఆకాశవాణి ఆలిండియా హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయ్‌శంకర్, తిరుపతి ఎస్వీ నాదస్వర పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి. సత్యనారాయణ, సాహితీవేత్త డాక్టర్ ఎం. ప్రభాకర్‌రావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగయ్య, వంశీ ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ వంశీ రామరాజు, జాతీయ వాయిద్య కళాకారుల సంఘం తెలంగాణ, ఏపీ అధ్యక్షులు కె. నర్సింహారావు, ఎల్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సుప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు డి. వి. మోహనకృష్ణ ఆధ్వర్యంలో బాలమురళీ గాన రవళి సంగీత కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ గాయకుడు వినోద్‌బాబు మధుర గీతాలను ఆలపించారు. అనంతరం నాదస్వర డోలు ఆంధ్రప్రదేశ్ విద్వాంసులచే కర్ణాటక సంగీత కచేరీ మృదుమధురంగా సాగింది.

విజయకుమార్-కృష్ణకుమారి సేవలు మరిచిపోలేం


కృష్ణకుమారికి నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: ప్రముఖ సంఘసేవకురాలు అరిగపూడి కృష్ణకుమారి సంస్మరణ సభ ఆదివారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. కళా సంస్థలు, పేదలకు సేవ చేయడంలో అరిగపూడి విజయకుమార్-కృష్ణకుమారి దంపతులు చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు. త్యాగరాయగానసభకు వీరిరువురు చేసిన సేవ తాము ఎప్పటికీ మరిచిపోమని అన్నారు.తెలుగు రాష్ట్రాల్లో విజయకుమార్ నుంచి సహాయం పొందని సాంస్కృతిక సంస్థ లేదన్నారు. విజయకుమార్ కుమారుడు సుమిత్, కుటుంబసభ్యులు, రామరాజు, రఘురామ్, మాస్టార్జీ, రవి, దుర్గాప్రసాద్, ఎస్‌బీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్యశిబిరం

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మాక్స్‌విజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. సీఐ కొత్తపల్లి ముత్తుతో పాటు సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో గువ్వల శ్రీనివాస్‌రెడ్డి, ఐస్‌క్రీం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి



స్నేహితుల దినోత్సవ వేడుకలు

వరల్డ్ ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకొని కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ మిత్రబృందం సభ్యులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్

చందానగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చందానగర్ ఫ్రెండ్స్‌కాలనీలో కార్పొరేటర్లు మంజులరెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్‌షిప్‌డే పురస్కరించుకుని మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కాలనీలో పచ్చదనం పెంచి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేష్, అక్బర్‌ఖాన్, గుడ్ల ధనలక్ష్మి, నరేందర్, వరలక్ష్మి, భవాని, కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నవీన్ పట్నాయక్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓల్డుబోయినపల్లి: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పర్యావరణ పరిరక్షణ సికింద్రాబాద్ విభాగం ప్రతినిధులు ప్రజలకు సూచించారు. ఆదివారం బోయినపల్లి గణేష్ మందిరంలో ఏర్పాటు చేసిన పర్యావరణ సంరక్షణ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో 32 మందికి శిక్షణనిస్తూ కాలుష్య రహిత జీవనంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు కనీసం 10 మొక్కలైన నాటే విధంగా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో ఎంత హాని ఉందో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డీవో దేవేందర్‌రెడ్డి, పర్యావరణ సంరక్షణ ప్రతినిధులు నన్నూరి రామిరెడ్డి, బ్రహ్మయ్య చౌదరి, సికింద్రాబాద్ విభాగం పర్యావరణ సంయోజక్ మల్లికార్జున్, పడాల రఘురామ పటేల్, విష్ణుమూర్తి, కేదార్ శంకర్, అశోక్, లైయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు కోల రవీందర్, శివశంకర్ పాల్గొన్నారు.


లారీ కిందికి దూసుకెళ్లడంతో ధ్వంసమైన కారు

కారును ఢీకొట్టిన లారీ

- ముగ్గురికి గాయాలు

జీడిమెట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడ గతి ట్రాన్స్‌పోర్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్, భానుప్రసాద్, మోహన్ ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో సుభాష్‌నగర్ నుంచి సూరారం సాయిబాబానగర్‌కు కారులో వెళ్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గతి ట్రాన్స్‌పోర్టు వద్దకు రాగానే పీబీ 11 సీబీ 9677 నెంబర్ గల లారీ డ్రైవర్ రివర్స్‌లో వేగంగా వచ్చి కారు ముందు భాగాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భానుప్రసాద్, మోహన్ తీవ్రంగా గాయపడ్డారు. నవీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కోడలుతో గొడవపడి అత్త అదృశ్యం


సుందర్‌శాంతి

బాలానగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోడలు, అత్త గొడవపడి అత్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. సుందర్ శివకుమార్ అనే ఆటో డ్రైవర్ బాలానగర్ శోభనాకాలనీ రోడ్‌నెంబర్-2లో తల్లి సుందర్‌శాంతి(57) భార్యపిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శనివారం ఉదయం సుందర్‌శాంతి శోభనాకాలనీ సాయిబాబ టెంపుల్ రోడ్డులో నివాసముండే ఐశ్వర్య (వరుసకు మనుమరాలు)ను కలిసేందుకు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చిన శాంతితో ఆమె కోడలు ఐశ్వర్య గొడవపడింది. అలిగిన అత్త శాంతి ఆధార్ కార్డును వెంటతీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఆమె కుమారుడు సుందర్ శివకుమార్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెట్స్‌కు సన్మానం


అథ్లెట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని దూలపల్లి సెయింట్ మార్టిన్స్ కాలేజీలో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అథ్లెట్స్‌కు సన్మానం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై ప్రతిభ కనబరిచిన వారిని అభినందించి అథ్లెటిక్స్ జాతీయ స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 150 మందికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జూలై 21న నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ 2024లో విజేతలుగా నిలిచిన కుత్బుల్లాపూర్‌కు చెందిన 50 మంది విద్యార్థులను జీడిమెట్ల దండమూడి ఎన్‌క్లేవ్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నివాసంలో ఆయనను ఆదివారం కలిశారు.
- పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను నియోజకవర్గంలోని సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాలను అందజేశారు.


చందానగర్ చండీహోమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు మంజుల తదితరులు

ఘనంగా బండి మైసమ్మ బోనాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ బండ మైసమ్మ బోనాల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ వేర్వేరుగా పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే

హైదర్‌నగర్: కూకట్‌పల్లి డివిజన్ దీనబంధుకాలనీలో మైసమ్మ పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాలు ఘనంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. అమ్మవారి దీవెనలతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, ఎండి ఇబ్రహీం, ఎల్లనాయకుడు, గిరి, మోహన్‌రావు, మహేందర్‌నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి లలితా పోచమ్మ ఆలయంలో చండీహోమం

చందానగర్: చందానగర్ గౌతమినగర్‌లోని మహాశక్తి లలితా పోచమ్మ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా మాజీ కౌన్సిలర్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో చండీహోమం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు మంజులరెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్ నిర్వహించారు.

కట్టమైసమ్మ ఆలయంలో పూజలు

బాలానగర్: బాలానగర్ డివిజన్ కల్యాన్‌నగర్ కట్టమైసమ్మ ఆలయంలో అమావాస్య పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన చండీ హోమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మధుబాబు, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్